క్లుప్తంగా

తిరుమలేశునికి గజ వాహన సేవ



కూచిపూడి నృత్యం చేసిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న చింతపట్ల బాబు

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో కొలువైన పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. దారి పొడవునా మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. ఈ వాహన సేవలో మడావారి వీధి యూత్ పాల్గొన్నారు. తొలుత ఆలయ అర్చకుడు భీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో బిళ్ల విశ్వేశ్వరరావు, లక్ష్మీకుమారి దంపతులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే మంగళవారం రాత్రి 50 మంది చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీనివాసా బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, పిచ్చుక మోహన్, బళ్ల సాయి పాల్గొన్నారు.

అన్న సమారాధన



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు, సతీష్ రాజు

తాళ్లరేవు: కేశవపురం గ్రామంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి కల్యాణ మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ గాదిరాజు సత్యనారాయణరాజు ప్రారంభించారు. తాళ్లరేవు, సుంకటరేవు, పోలేకుర్రు, పి.మల్లవరం, యానాం తదితర గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు తరలివచ్చి, అన్న ప్రసాదం స్వీకరించారు. తొలుత ఆలయ అర్చకులు పెద్దింటి శ్రావణ్ కుమార్ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

చెరువుల అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



ముమ్మిడివరంలో మత్స్యశాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

ముమ్మిడివరం: నగర పంచాయతీలోని 14వ వార్డు చిప్పలపాలెంలో కొందరు అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని, వాటిని వెంటనే నిలుపుదల చేయాలని ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు అన్నారు. ఈ మేరకు నగర పంచాయతీ వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్, ఆర్డీఓ, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పచ్చని పొలాల్లో ఆక్వా చెరువుల తవ్వకం వల్ల సరిహద్దు పొలాలు ఉప్పునీటి కయ్యలుగా మారి తమకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదే ఒరవడి కొనసాగాలి



మల్లాడిని సత్కరిస్తున్న విద్యాశాఖాధికారి ప్రవీణ్ లక్ష్మణ్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్కూళ్లలో ఇటీవల మెరుగైన రీతిలో వచ్చిన సీబీఎస్ఈ పరీక్షా ఫలితాలు భవిష్యత్తులో సైతం కొనసాగాలని, దీని కోసం ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ స్కూళ్ల నూరుశాతం ఉత్తీర్ణత సాధించడాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఉపాధ్యాయులు మల్లాడి నివాసానికి వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైతం నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను గురువారం సత్కరిస్తామన్నారు.

బీమా చెక్కు అందజేత

ముమ్మిడివరం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పేరూరి మహాలక్ష్మి కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, దాట్ల పృథ్వీ రాజ్, కురసాల శివబాబు పాల్గొన్నారు.

చల్లగా.. ఆరోగ్యంగా..



ముమ్మిడివరంలో విక్రయానికి సిద్ధం చేసిన పుచ్చకాయలు

- పుచ్చకాయల్లో ఎన్నో పోషకాలు
- వేసవి తాపం నుంచి ఉపశమనం
- కొనుగోలుకు ప్రజల ఆసక్తి

ముమ్మిడివరం: ప్రస్తుతం ఎండలు మండి పోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలు, పుచ్చకాయలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా చల్లదనంతో పాటు పోషక విలువలు కలిగిన పుచ్చకాయలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

జోరుగా విక్రయాలు

ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లో 216 జాతీయ రహదారి వెంబడి పుచ్చకాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. చిరు వ్యాపారులు సైతం పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. వీటిని తమిళనాడు, కడప, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నారు. ఇతర పండ్లు, ఫలాలతో పోలిస్తే పుచ్చకాయలు అందుబాటు ధరలలో లభిస్తున్నాయి. వీటిని వ్యాపారస్తులు కేజీ రూ.20 నుంచి రూ.25 వరకూ విక్రయిస్తున్నారు.

పోషకాలు పుష్కలం

పుచ్చకాయలో ఏ, సీ విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం, సోడియం, పీచు, క్యాల్షియం విస్తారంగా ఉంటాయి. శరీరానికి అవసరమైన శక్తిని ఇస్తాయి. విటమిన్ ఏ కంటి చూపును మెరుగుపరిస్తే, విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఈ కాలంలో తరచుగా 92 శాతం నీటితో ఉన్న పుచ్చకాయల తినడం మంచిది. దీని వల్ల గొంతు తడారి పోవడం, ఒంట్లో నీరు ఇంకిపోవడం, డీహైడ్రేషన్ లాంటి సమస్యలు తలెత్తవు. కండరాల నొప్పులు తగ్గుతాయి. ఇందులో చెడు కొలెస్ట్రాల్ ఉండదు. గుండె జబ్బులను రానీయకుండా ఉండటంతో పాటు శరీరాన్ని శుద్ధి చేస్తోంది. చర్మాన్ని సురక్షితంగా ఉంచుతుంది. రక్తంలో చెక్కెర స్థాయిని పెరగనివ్వదు. పుచ్చకాయ గింజల్లో కూడా గొప్ప పోషకాలుంటాయి.

టన్నుల లెక్కన కొనుగోలు

వేసవి సీజన్‌లో పుచ్చకాయలను కడప, చిత్తూరు, తమిళనాడు, ప్రాంతాల నుంచి టన్నుల లెక్కన కొనుగోలు చేస్తాం. ఇక్కడ కేజీ రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నాం. ఉష్ణోగ్రతలు పెరగడంతో వ్యాపారం బాగా జరుగుతోంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

– వి.శ్రీనివాసరావు, పుచ్చకాయల వ్యాపారి, యానాం

శరీరానికి చల్లదనం



వేసవి కాలంలో లభించే పుచ్చకాయలు ఆరోగ్యానికి మంచిది. దీనిలో 92 శాతం నీరు ఉండడంతో శరీరానికి చల్లదనం లభిస్తుంది. పోషకాలు కారణంగా వేసవి తాపం నుంచి ఉపశమనం కలుగుతుంది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పుచ్చకాయను తినవచ్చు. ఎండ వేడికి ఒంట్లో నీరు ఇంకిపోవడం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తవు. రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది.

– డాక్టర్ ముకుంద, వైద్యాధికారి, కొత్తలంక పీహెచ్‌సీ

అమలాపురంలో ట్రాఫిక్ ఆంక్షలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ ప్రవేశమైన ఈదరపల్లి వంతెన వద్ద మరో కొత్త వంతెన నిర్మిస్తున్న క్రమంలో విధించిన ట్రాఫిక్ ఆంక్షలు బుధవారం నుంచి అమలులోకి వచ్చాయి. అంబాజీపేట, రావులపాలెం, రాజమహేంద్రవరం వైపు వెళ్లే, వచ్చే వాహనాలను ట్రాఫిక్ మళ్లింపుతో ప్రత్యామ్నాయ మార్గాలను పట్టణ ట్రాఫిక్ పోలీసులు చూపించిన విషయం విదితమే. వాస్తవానికి ట్రయల్స్ పూర్తయ్యాక ఒకట్రెండ్ రోజుల్లో ఈ ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయాలని పోలీసులు భావించారు. ఆర్అండ్‌బీ అధికారుల సూచనల మేరకు పాత వంతెన ఉనికి దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా ట్రాఫిక్ ఆంక్షలను బుధవారం నుంచే అమలులోకి తెచ్చారు. దీంతో ఈదరపల్లి పాత వంతెనపై కొత్త వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకూ పూర్తిగా ట్రాఫిక్‌ను నిలిపివేశారు. కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశాలతో ఆర్అండ్ ఈఈ బి.రాము పాత వంతెన దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు ఈ ట్రాఫిక్ ఆంక్షలను బుధవారం నుంచి అత్యవసరంగా అమలులోకి తెచ్చి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ట్రాఫిక్ ఆంక్షలకు వాహన చోదకులు, ప్రజలు సహకరించాలని సీఐ వీరబాబు విజ్ఞప్తి చేశారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు నిఘంటువులను బహూకరిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: కష్టపడి చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సొంతం అవుతుందని, ఉన్నత విద్యాభ్యాసానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అధిక మార్కులు పొందిన విద్యార్థులను బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా నిఘంటువులు బహుకరించి ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిభా వంతులైన విద్యార్థులను అభినందించడం చాలా ముఖ్యమన్నారు. వారి కృషి, పట్టుదల, అంకితభావానికి ఈ ప్రశంసలు ఒక చిన్న గుర్తింపుగా నిలుస్తాయన్నారు. మెరిట్ సాధించిన విద్యార్థులందరికి ఆమె అభినందనలు తెలిపారు. విద్యార్థుల అద్భుతమైన విజయాలు జిల్లా విద్యా శాఖ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. ఈ విజయాలు పాఠశాలకే కాకుండా, కుటుంబానికి కూడా గర్వకారణంగా నిలుస్తారన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏ ఉన్నత చదువులు అభ్యసించాలనుకుంటున్నారన్న విషయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి విజయాల పరంపరను ప్రతి దశలో సాధించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థుల కలలు ఆశయాలు సాకారం కావాలని కోరుకుంటూ ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా సదాశివ నిలయ ప్రథమ వార్షికోత్సవం



వార్షికోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీలో జాతీయ రహదారి 216 చెంతన యానాంకు చెందిన డాక్టర్ సలాది రామన్న నాయుడు నిర్మించిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయ (శ్రీ సదాశివ నిలయం) ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, స్వామి అయ్యప్ప, భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామివార్లకు వేద పండితులు ఆకొండి వ్యాసమూర్తి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ నిర్మాణకర్త సలాది రామన్న నాయుడు మాట్లాడుతూ తాను కొనుక్కున్న స్థలంలో ప్రహరీ కడుతుండగా, మంచి ప్రకాశవంతమైన శివలింగం బయటపడిందని, పెద్దలను సంప్రదించి ఈ ఆలయం నిర్మించినట్లు తెలిపారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సలాది సత్యన్నారాయణమూర్తి, సలాది సాంబశివరావు, కోన దేవ, నిమ్మకాయల శ్రీను, కృష్ణంరాజు, తోట మల్లికార్జునరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే

అమలాపురం రూరల్: భూ సంబంధిత సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ఉద్దేశించిన ఒక ముఖ్యమైన ప్రక్రియ రీసర్వే అని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. బుధవారం అమరావతి నుంచి భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి ఎన్.ప్రభాకర్‌రెడ్డి 26 జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూముల క్రమబద్ధీకరణ చట్టం – 2025, అందరికీ ఇల్లు, నీటి తీరువా వసూళ్లు, రీ సర్వే పైలట్ ప్రాజెక్టు రెండో దశ పురోగతి అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ మండల సర్వేయర్లు రీ సర్వే డీటీలు, తహసీల్దార్లు పూర్తి సమన్వయంతో భూ రికార్డులను స్వచ్ఛీకరించి భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రోజుకు 20ఎకరాల మేరకే రీ సర్వే చేయాలన్నారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటి స్థలం కుటుంబంలోని మహిళ లబ్ధిదారు పేర జారీ చేయాలన్నారు. డీఆర్ఓ రాజకుమారి, ఆర్డీవోలు పి. శ్రీకర్, డీ.అఖిల, కె.మాధవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, భూ పరిపాలన సూపరింటెండెంట్ బోసుబాబు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాలు వేగవంతం చేయాలి

216 జాతీయ రహదారి నిర్మా ణంలో ఉత్పన్నమైన భూసమస్యలను అధిగమించి రోడ్డు నిర్మాణానికి చర్యలు వేగవంతం చేయాలని జేసీ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారులు రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ 216 నిర్మాణ పనులు భూసేకరణ అవార్డులు నష్టపరిహారాల చెల్లింపు అంశాల పురోగతిపై సమీక్షించారు.

దివ్యాంగుల పాఠశాలలో స్టేషనరీ దినోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక వడ్డిగూడెంలో గల శ్రేయ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ప్రపంచ స్టేషనరీ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన సభకు వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన వహించారు. క్లబ్ తరఫున పాఠశాల ఉపాధ్యక్షురాలు తోట ఆది పద్మతాయారుకు పుస్తకాలను క్లబ్ అధ్యక్షుడు సత్య వర ప్రసాద్ అందజేశారు. సభకు పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, డాక్టర్ అనంతలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. నేటి విద్యార్థులు చేతిరాత, చిత్ర కళలకు సంబంధించిన పుస్తకాలను వినియోగించడం లేదని డాక్టర్ శ్రీమన్నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ ప్రతినిధులు కుడుపూడి త్రినాథ్, పేరి లక్ష్మీ నరసింహం, పచ్చిగోళ్ల రాజా పాల్గొన్నారు.

అపరి-చితుల కాల్స్ నమ్మవద్దు

అమలాపురం రూరల్: అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గరావు దొర అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రైవేటు హాస్పిటళ్లు, లేబోరేటరీలు, డెంటల్ క్లినిక్‌లకు అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి డీఎంహెచ్‌వో కార్యాలయం నుండి మాట్లాడుతున్నామని చెబుతున్నారన్నారు. మీ ఆసుపత్రి మీద ఫిర్యాదు వచ్చిందంటూ సొమ్ములు డిమాండ్ చేస్తున్నారన్నారు. అటువంటి ఫోన్లు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. కొందరు దళారులు తమ రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పి అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేస్తున్నారని కూడా తెలిసిందనన్నారు. అటువంటి వారిని నమ్మి మోస పోవద్దన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాన్నారు. ఈ సెల్ నెంబర్ల 70326 72067, 91822 24720 డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి చేస్తున్నామని చెబుతున్నారన్నారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన విషయాలను కె.వీరబాబు, స్టాటిస్టికల్ ఆఫీసర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, ముమ్మిడివరంలో సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి ఉత్సవాలు



సంగీత కళాకారులను సత్కరిస్తున్న సంస్కార భారతి జిల్లా శాఖ ప్రతినిధులు

అమలాపురం టౌన్: సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవాలు స్థానిక సుభద్ర నర్సింగ్ హోమ్ వద్ద బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ అయ్యగారి రాధిక చేసిన వీణాగానం ఆహూతులను అలరించింది. సంస్కార భారతి ప్రతినిధి శ్రీగిరి పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ జయంతి ఉత్సవంలో తొలుత అన్నమయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నమస్సుమాంజలి ఘటించారు. అన్నమయ్య కీర్తనలను నాగ కమల లయబద్ధంగా ఆలపించి రంజింపచేశారు. అలాగే సంగీతం మాస్టారు మట్టపర్తి చంద్రశేఖర్ కూడా అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. చిన్నారి లహరి ఆలపించిన కీర్తనలు అందిరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం సంగీత కళాకారులను సంస్కార భారతి ప్రతినిధులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సంస్కార భారతి ప్రతినిధులు వీవీఆర్ నాయుడు, వేదనభట్ల సాయిలక్ష్మి, యెండూరి సీతామహాలక్ష్మి, పేరి లక్ష్మీనరసింహం, నూకల సత్యనారాయణ, భమిడపాటి సుగుణేశ్వరి, కూచిమంచి వెంకటరాజు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థుల ప్రతిభ

యానాం: నియోజకవర్గపరిధిలోని మెట్టకూరు పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో 12, 10 తరగతుల వార్షిక పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని బుధవారం ప్రిన్సిపాల్ ఎస్.కీర్తి తెలిపారు. పదో తరగతి విద్యార్థి బండారు దుర్గేష్ కనకారావు, చిత్తూరి శ్రీవిద్య, ఎం.షణ్ముఖ వర్షిణి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. అలాగే 12వ తరగతిలో వై.యోగలక్ష్మి, టీడీ కౌశిక్, డి.మీనాక్షి శశిరేఖ, దివ్యానుష్‌శ్రీ, సి.రాజు ప్రతిభ చూపారన్నారు. పరీక్ష రాసిన 32 మందిలో 30 మంది డిస్టింక్షన్‌లో పాసయ్యారన్నారు. ఆ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ఉప్పలగుప్తం: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. పెదగాడవిల్లి పంచాయతీ పరిధి వల్లాయి చెరువులో జరుగుతున్న 134వ జయంత్యుత్సవాలకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుద్దటి వెంకట మహాలక్ష్మీ నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, గ్రామ పెద్దలు దొనిపాటి వెంకటేశ్వరరావు, సాక మీరాసాహెబ్, దొనిపాటి సింగ్, పెయ్యల కొండబాబు, మోటూరి సత్యంకాపు పాల్గొన్నారు.

బాటసారులు, పేదలకు వితరణ

అమలాపురం టౌన్: స్థానిక సినిమా రోడ్డులో గల భారత్ పెట్రోలియం బంక్ వద్ద బుధవారం ఆ బంక్ యాజమాన్యం బాటసారులకు పులిహోర పొట్లాలు, చల్లటి తాగునీరు, పేదలకు వస్త్రదానం చేసింది. బంక్ వ్యవస్థాపకుడు యర్రమల్లి నాగేశ్వరరావు 25వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం సహాయ కార్యదర్శి విశ్వేశ్వరరావు, సత్తిబాబు ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు. అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన చేతుల మీదుగా బాటసారులకు పులిహోర పొట్లాలు, పేదలకు వస్త్రదానం జరిగింది. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సలహాదారు నంబూరి విశ్వనాథం మాట్లాడుతూ దివంగత నాగేశ్వరరావు సేవా తత్పరతను, ఆయన సేవా పనులను వివరించారు. ఆర్య వైశ్య నాయకులు నంబూరి శ్రీనివాస్, నూలు సూర్య ప్రభాకరావు, గ్రంధి గుప్తా, ఎస్.రాంపండు తదితరులు పాల్గొన్నారు.

రోగుల మందులు బయటకు రాయకండి

యానాం: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులకు వచ్చే రోగుల మందులు బయట షాపులకు రాయవద్దని సీఎం రంగసామి సూచించారు. బుధవారం జరిగిన పుదుచ్చేరి సంక్షేమశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రోగులకు అవసరమైన మందులను సంబంధిత ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాకు ఉంచుతున్నామన్నారు. మెడికల్ రిలీఫ్ అసోసియేషన్ ద్వారా మెడికల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్‌ను అమలు చేస్తున్నామన్నారు. గుండె, బ్రెయిన్ ఆపరేషన్‌లకు సంబంధించి సదుపాయాలను స్థానిక ఇందిరాగాంధీ మెడికల్ కాలేజీలో ఏర్పాటుచేశామని ఆపరేషన్‌లు సైతం ప్రారంభమయ్యాయన్నారు. కిడ్నీ సంబంధిత లేబీలను సైతం త్వరితంగా ఏర్పాటుచేస్తున్నామన్నారు.

మెగా వైద్య శిబిరం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో నల్లా సూర్య చంద్రరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో కాపురత్న అవార్డు గ్రహీత దివంగత నల్లా సూర్యచంద్రరావు తనయుడు నల్లా అజయ్ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 225 మందికి వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిక్కం పెదబాబు, నల్లా సంజయ్, నల్లా శ్రీధర్, కల్లకోలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, అరిగెల నానాజీ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

యానాం: మాతృభూమి రక్షణలో అమరులైన సైనికులకు నివాళిగా బుధవారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్టేడియం రహదారిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అర్ధాని దినేష్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల రక్షణకు సైనికులు చేస్తున్న త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలన్నారు. అనంతరం చలివేంద్రాన్ని సీఐ అడలరసన్ ప్రారంభించారు.

మూడు ఇళ్లు దగ్ధం

ఐ.పోలవరం: తిళ్లకుప్ప గ్రామంలో బుధవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన పళ్ల వెంకట్రావు, పళ్ల అర్జునరావు, పళ్ల రాంబాబులకు చెందిన తాటాకిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వద్ద ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.ఐదు లక్షల ఆస్తినష్టం సంభవించింది. మంటలు ఎగసి పడకుండా స్థానికులు అదుపు చేశారు. బాధితులు కట్టుబట్టలతో బయటపడ్డారు.

27న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఇంపాక్ట్

యానాం: యానాం రీజినల్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో 24 కాంట్రాక్టు ఉద్యోగ పోస్టుల భర్తీకి సంబంధించి బుధవారం సాక్షిలో 'ప్రకటన విడుదల చేసిన రోజే ఇంటర్వ్యూలా' శీర్షికన వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో మెడికల్, టెక్నికల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ విభాగాల్లో పోస్టుల భర్తీకి ఈ నెల 27 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయని మిషన్ డైరెక్టర్ రవిశంకర్ తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి అర్హతలు, వయసు, రెమ్యూనిరేషన్ తదితర వివరాలను ఎన్‌హెచ్‌ఎమ్‌పుదుచ్చేరి.ఓఆర్‌జి.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి కొన్ని పాలనా పరమైన కారణాలతో ఈ నెల 13న ఇంటర్వ్యూలు జరిపామని, అప్పుడు వచ్చిన 27న రావాల్సిన అవసరం లేదన్నారు.

సాన్వీకి అభినందనలు



సాన్వీని అభినందిస్తున్న డీఈవో సలీం బాషా

అమలాపురం రూరల్: ఇటీవల గుంటూరులో జరిగిన అండర్ – 7 స్టేట్ చెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించిన సాన్వీని డీఈవో సలీం బాషా అభినందించారు. అలాగే జాతీయ సాయి చదరంగ పోటీలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ఏడేళ్ల సాన్వీ ఎంతో మంది చిన్నారులకు స్ఫూర్తిదాయకమన్నారు. అలాగే పాఠశాల చైర్మన్ నంద్యాల నాయుడు, పాఠశాల డైరెక్టర్ల నంద్యాల మనువిహార్, స్నేహప్రియ, ప్రిన్సిపాల్ దేవి దీక్షిత్, కోచ్‌లు వి.శ్రీను, కె.రాజు అభినందించారు.

చిట్టిబాబుకు డాక్టరేట్



ముమ్మిడివరం: ముమ్మిడివరం ప్రభుత్వ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్, వైస్ ప్రిన్సిపాల్ కందికట్ల చిట్టిబాబు గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆయన అప్లైడ్ గణితంలో ఈ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు విశాఖపట్నం గీతం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. క్రిప్టోగ్రఫీ, నెంబర్ థియరీలో పలు అంశాలపై చిట్టిబాబు చేసిన పరిశోధనలకు డాక్టరేట్ అందించనున్నారు. లెక్చరర్ చిట్టిబాబును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ప్రభాకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: నియోజకవర్గంలోని ఎరుపు రంగు రేషన్ కార్డులను పసుపు కార్డులుగా మార్పు చేసే ప్రక్రియంలో భాగంగా దరఖాస్తులను సివిల్ సప్లయిస్ కార్యాలయంలో మాత్రమే అందజేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. ఆయన బుధవారం మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువ (బీపీఎల్)న ఉంటున్న కొందరు పసుపురంగు రేషన్ కార్డులు కలిగి ఉన్నారన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. వాటిని ఎరుపురంగు రేషన్‌కార్డులుగా మార్చడం వల్ల పథకాలు అందుతాయన్నారు. అలాంటి వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, అనంతరం అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. కావున దరఖాస్తులను మధ్యవర్తులకు కాకుండా సివిల్ సప్లయిస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

20న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

యానాం: కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను యానాంలో సైతం విజయంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఈ మేరకు యానాంలోని అన్ని పరిశ్రమలకు నోటీసు ఇచ్చామని, పోస్టర్లు పంపిణీ చేశామన్నారు. మోదీ ప్రధానిగా కేంద్రంలోని ఎన్డీయే కూటమి ఈ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. వీటిని రద్దు చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్‌తో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

నివేదిక ఆవిష్కరణ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో సామాజిక, ఆర్థిక అంశాలతో కూడిన స్టాటిస్టికల్ మాన్యువల్‌ను బుధవారం సీఎం రంగసామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ శాఖ ఆధ్వర్యంలో పుదుచ్చేరి ప్రభుత్వం 'పుదుచ్చేరి ఎట్ ఎ గ్లేన్స్–2024' హ్యాండ్ బుక్‌ను రూపొందించింది. కార్యక్రమంలో స్పీకర్ సెల్వం, మంత్రి లక్ష్మీనారాయణ, ఎస్.తిరుమురుగన్, ప్రకాష్ బాబు పాల్గొన్నారు.